

కథా కౌముది

# రాధ-కృష్ణ

జయదశ్రీ కల్లూర్ ,Overland Park,KS

*వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన 16వ ఉగాది ఉత్తమ రచనల పోటీలో – నా మొట్టమొదటి కథ విభాగంలో - ప్రశంసాపత్రం పొందిన కథ*

"**రాధా! చీకటి పడుతోంది** కేక్ కట్ చెయ్యి.. మళ్ళీ వెళ్ళిపోవాలి. కేక్ తెచ్చి టేబుల్ మీద పెట్టు" అంది చంద్ర.

"అవును లెట్స్ విష్ రాధ హాపీ బర్త్‌డే" అంటూ కాండిల్స్ వెలిగించింది రాగిణి.

కేక్ కట్ చేసి అందరికి ఇచ్చింది రాధ. గంధం కలర్ మీద డార్క్ బ్రౌన్ ప్రింటెడ్ కాశ్మీర్ చీరలో కళ్ళనిండా కాటుక పెట్టుకుని, తలనిండా మల్లెపూలతో కళకళలాడుతూ అందంతో మెరిసిపోతున్న రాధని చూస్తూ

"నా దిష్టే తగిలేలా ఉందే నీకు" అంది రాగిణి.

"అవునే.. ఈ చీర నీకు బాగా సూట్ అయింది. పెళ్ళికళ వచ్చేసిందే " అంది చంద్ర నవ్వుతూ.

"అబ్బ ఊరుకోండే. పదవే చంద్రని బస్ ఎక్కించేసి వద్దాం" అంటూ బయటకి నడిచింది రాధ.

చంద్రని బస్ ఎక్కించి కబుర్లు చెప్పుకుంటూ ఇంటికొస్తుంటే "వర్షం వచ్చేలాగుందే. " అంది రాగిణి మబ్బులు పట్టిన ఆకాశాన్ని చూస్తూ.

అంతలో సన్నగా చినుకులు మొదలయ్యి ధారాపాతంగా పడటం మొదలు పెట్టింది.

"అదిగో ఆ షాప్‌లో కింద షెల్టర్‌లో నిలబడదాం రా!" అంటూ అటు పరిగెత్తింది రాధ తడిసిపోతున్న కొత్త చీరని బాధగా చూసుకుంటూ. వర్షం ఎప్పుడు తగ్గుతుందా అని అసహనంగా చూస్తున్న రాధకి తనని ఎవరో గమనిస్తున్నట్లగ అనిపించి అటువైపు చూసింది. మోటర్ బైక్‌ని ఆనుకుని వర్షంలో తడుస్తున్నా అలాగే నిల్చుని సిగరెట్ పట్టుకుని తనవైపే కళ్ళు ఆర్పకుండా నిశ్చలంగా చూస్తున్న ఆరు అడుగుల ఆజానుబాహువు కనిపించాడు. ఆ చూపులు తన గుండెల్లో గుచ్చినట్లుగా అనిపించి ఒళ్ళు జలదరించింది రాధకి.

***

"వర్షం తగ్గింది పద పోదాం.." అంటూ రాగిణి చెయ్యిపట్టి లాగటంతో ఉలిక్కిపడి లేచింది ఛెల్సి.

ఏ.సి రూములో కూడా చెమటతో తడిసిపోయిన ఛెల్సి పక్కనే ఉన్న వాటర్ జగ్‌లో నీళ్ళని గడగడ తాగి లేచి లైట్ వేసి చుట్టూ చూసుకుంది తను ఎక్కడ ఉన్నాను అనుకుంటూ. My God it was a dreem who was she? She looks like me..Where was that place. What were they talking.. తలంతా దిమ్ముగా అయిపోవడంతో లివింగ్ రూములోకి వచ్చి టీవి ఆన్ చేసుకుని అక్కడే పడుకుని నిద్రపోయింది.

***

వెన్నలలో ఆ ప్రదేశమంతా తెల్లగా మెరిసిపోతోంది. రాధని చూస్తూనే ఫక్కుమని నవ్వాడు కృష్ణ.

"ఏయ్ ఎందుకు నవ్వుతున్నావు? " కోపంగా చూస్తూ..

"నువ్వు కోపంలో భలే అందంగా ఉంటావు తెలుసా? "

"ఏయ్! మాట్లాడకు నువ్వసలు రెండు రోజుల్లో వస్తాను అని చెప్పి ఊరెళ్ళిన మనిషి రెండు వారాలు అయినా రాకపోగా కనీసం లెటర్స్ కూడా రాయకపోతే కోపం రాదా? " అంది మరింత బిగదీసుకుంటూ....

"సారీ రాధా..నాన్నని హాస్పిటల్‌లో జాయిన్ చేసారు. టూ వీక్స్ అక్కడే ఉండిపోయాను. నిన్ననే డిస్చార్జ్ చేసారు" అన్నాడు రాధకి దగ్గరగా కూర్చుంటూ..

"సారీ కృష్ణ.. నిన్ను చూడందే ఒక్కరోజు కూడా ఉండలేను.." వస్తున్న కన్నీళ్ళను ఆపుకుంటూ బేలగా చూసింది.

"ఓకె. ప్రామిస్ ఇంకెప్పుడు నిన్ను వదిలి వెళ్ళను.. నీ దగ్గరే ఉంటాను" అంటూ మరింత దగ్గరగా జరిగి ముద్దుపెట్టుకోబోయాడు...

***

"నో.. " అంటూ అరుస్తూ లేచి కూర్చుంది ఛెల్సి.

"వాట్ హాపెండ్ బేబి? " అంటూ కంగారుగా దగ్గరకి వచ్చిన మోనికాని అయోమయంగా చూస్తూ "మామ్.." అంటూ గట్టిగా కౌగిలించుకుని

"I do't know Mom. I am getting these weired dreems and they are keep comming" అంది వణికిపోతూ...

"Do't worry My child its just a dream take shower and go to school..I have a case to attend" అంటూ గబగబా వెళ్ళిపోతున్న మోనికా వైపు నిస్పృహగా చూస్తూ లోపలికి నడిచింది.

"Belive me Siva. I am getting these dreems since I argued with prof.john about incarnation in Hinduisom class. But still I do't believe in re birth but these dreems are killing me. The lady in my dreams looks like me, but not sure who she is.. " అంటూ చెప్పుకుపోతున్న ఛెల్సిని చూస్తూ అప్పటి దాకా జోక్ చేస్తోందేమో అనుకుంటున్న శివకి ఒక్కసారిగా ఒళ్ళుజలదరించింది.

"I want know what language they are talking Siva, I will find out" అంది స్థిరంగా.

"Mom.. Can I ask you some thing?" వణుకుతున్న వాయిస్‌ని కంట్రోల్ చేసుకుంటూ అడిగింది ఛెల్సి. భోజనం ముగించుకుని వచ్చి సోఫాలో కూర్చుంటున్న మోనిక, ఛెల్సిని

"అడుగు బేబి" అంది కుతూహలంగా..

"నీకు నీకు.. రాధ అని పేరున్న వాళ్ళు ఎవరైనా తెలుసా? "

హఠాత్తుగా ఆ పేరు వినంగానే త్రుళ్ళిపడింది మొనిక హఠాత్తుగా.

"నీకు ఎలా తెలుసు అంది? " ఛెల్సిని కుదిపేస్తూ..

"చెపుతాను.. బట్ ఎవరు మమ్మీ రాధ..? " సస్పెన్స్ భరించలేనట్టు చూసింది ఛెల్సి..

"రాధ ఈజ్ మై మామ్" అంది మోనిక.

"వాట్..!" చెల్సె ఉలిక్కిపడింది.

"యువర్ మామ్ ఈజ్ నాట్ 'నాన్సి'?" ఆశ్చర్యంగా చూస్తూ అడిగింది చెల్సె .

"Hmm .. it's a long story baby. రాధ Is my birth mom. She died after my birth due to post delivery complications. She was only 22 years Old at that time it seems.. after some time నాన్సిని పెళ్ళి చేసుకున్నారు మా నాన్న. నాన్సి నన్ను కన్న కూతురుకంటె ఎక్కువగా చూసుకుంది. నాకు మా నాన్న లాస్ట్ ఇయర్ చనిపోయె ముందర ఈ విషయం చెప్పారు అప్పటి దాకా నాకు తెలీదు నాన్సి మా అమ్మకాదని. నాన్నవాళ్ళ ఆల్బమ్ జ్యూలరీ ఇస్తూ నీకు చెప్పకూడదు అనుకున్నా బేబి కాని నీకు తెలియటం నీ హక్కు అని చెపుతున్నా. చెపితే బాధ పడతావని చెప్పలేదు అన్నారు. కొన్ని రోజులు బాధపడ్డాను కాని నాకు తెలిసి అమ్మ నాన్సి కాబట్టి తనతో ఉంటూ మర్చిపోయాను. " అంది మోనిక దీర్ఘంగా నిట్టూర్పు విడుస్తూ.

"నాకు ఎందుకు చెప్పలేదు మమ్మీ? " అంది ఛెల్సి బాధగా చూస్తూ.

"Do't know baby, may be I am not ready yet to say. అయినా ఎందుకు అడుగుతున్నావు ఈ సంగతులన్ని? "

అప్పుడు చెప్పింది దాదాపు నెలరోజులుగా వస్తున్న తన కలల గురించి.

ఆశ్చర్యంగా చూసింది మోనికా "ఓ మై గాడ్! ఐ థింక్ ఇండియాలో అనుకుంటా.. వాళ్ళు మాట్లాడుతున్నది తెలుగు అనుకుంటా.. మా నాన్న వాళ్ళ పేరెంట్స్ మాట్లాడే వారు" అంది మోనిక.

"I am fine Mom.. Album ఎక్కడ ఉంది? " కుతూహలంగా చూస్తూ అడిగింది ఛెల్సి.

"బెడ్ రూములో ఉంది తెస్తాను" అంటూ లోపలి కెళ్ళింది మోనిక.

ఛెల్సి ఆల్బమ్ తీసుకుని మొదటి పేజి తెరిచింది. ఉలిక్కిపడి మళ్ళీ చూసింది అవును తన కలల్లోకి వచ్చిన రాధ పింక్ శారి కట్టుకుని ఆకాశం వైపు నవ్వుతూ చూస్తోంది అబ్బ ఎంత అందంగా ఉంది. అనుకుంటూ రెండో పేజి తిప్పింది. పెళ్ళి ఫోటో కాని రాధ పక్కన ఉన్నది కృష్ణ కాదు తన గ్రాండ్ పా. అంటే రాధ పెళ్ళి చేసుకున్నది కృష్ణని కాదా? ఎందుకు కాలేదు.. ఎలా తెలుస్తుంది.. తలపగిలిపోతుంటే రెండు స్లీపింగ్ పిల్స్ వేసుకుని పడుకుంది ఛెల్సి.

***

ఆర్ట్స్ కాలేజ్ వెనకాల పెద్ద బూరుగు చెట్టుకింద చిన్న కొండ. రోజూ కలుసుకునే చోటుకి వచ్చారు ఆ రోజు కూడా.

" ఉగాది శుభాకాంక్షలు రాధ దేవిగారు" అంటూ చిన్న గిఫ్ట్ బాక్స్ ఇచ్చాడు కృష్ణ.

గులాబి రంగు జార్జెట్ చీరలో తలనిండా విరజాజిపూలతో అందంగా మెరిసిపోతున్న రాధని తన్మయంగా అలాగే చూస్తూ ఉండిపోయాడు.

" Same to you Krishna గారు... " తెల్లటి ఫుల్ హాండ్ షర్ట్, నల్లటి కొర్డాయ్ జీన్స్ ఉంగరాల జుత్తు గాలికి మొహం మీద పడుతుంటే కొంటెగా నవ్వుతున్న కృష్ణని మురిపెంగా చూసుకుంటూ " ఇవిగో ఉగాది పచ్చడి, బొబ్బట్లు తీసుకో.. " అంది ముందర పెట్టి.

" ఉహూ< నువ్వే తినిపించు..! " అంటూ కూర్చున్న రాధ వడిలో తలపెట్టుకుని బొబ్బట్టు తింటూ "అబ్బ ఎంత తీయగా ఉన్నాయో నీలాగే.. " అన్నాడు కవ్వింపుగా రాధ కళ్ళల్లోకి చూస్తూ.

"ఛీపో అల్లరి. నువ్వే తిను నేను వెళ్ళిపోతా" అంటూ పరిగెత్తబోయి..

***

కాలికి రాయి తగలడంతో "అబ్బా! " అంటూ లేచి కూర్చుంది ఛెల్సి. కాలు మండుతున్నట్టుగా అనిపించి చూసుకుని ఉలిక్కిపడింది. రాధకి తగిలిన చోటే తనకి మచ్చ ఉంది. ఇంతదాకా చూడలేదు కాని ఇప్పుడు ఇలా.

"మామ్ నేను ఇండియాకి వెళతాను" అంది ఛెల్సి డిన్నర్ టేబుల్ దగ్గర.

"వాట్?" ఆశ్చర్యంగా చూసాడు జాన్. మోనిక వివరంగా చెప్పింది కల గురించి.

జాన్ ఆశ్చర్యం నుంచి తేరుకుని "ఎస్ డియర్ తప్పకుండా వెళ్ళు" అన్నాడు.

"థాంక్స్ డాడ్! ఇండియాలో రాధ ఫ్యామిలీ మెంబర్స్ ఎవరైనా ఉన్నారేమో తెలుసుకుంటాను.. " అంది ఛెల్సి.

మోనిక తన దగ్గర ఉన్న అడ్రెస్ ఇచ్చింది తనకి వాళ్ళ నాన్న ఇచ్చారంటు.

శివ తను కలిసి ఇన్ఫర్మేషన్ కలెక్ట్ చేసుకున్నారు. శివకి తెలిసిన ఒక తెలుగు ఫ్యామిలీకి పరిచయం చేసాడు. వీలైనప్పుడల్లా వాళ్ళింటికి వెళ్ళి తెలుగు నేర్చుకోసాగింది. వాళ్ళు కూడా ఆశ్చర్యపోయారు అంత తొందరగా ఛెల్సి అనర్గళంగా తెలుగు మాట్లాడటం చూసి.

సమ్మర్ హాలిడేస్ మొదలు కావడంతో టు మంత్స్ వెకేషన్ ఉంది కాబట్టి ఆ టైములో వెళ్ళడానికి డిసైడ్ చేసుకుంది ఛెల్సి. శివకూడా తన పేరెంట్స్ ముంబాయిలో ఉన్నారు కనక తను కూడా వస్తాను అన్నాడు హైదరాబాద్ దాకా. అతనికి చాలా ఎగ్జైటింగా ఉంది రాధ గురించి తెలుసుకోడానికి.

హైదరాబాద్ ఎయిర్ పోర్ట్‌లో కాలుపెట్టగానే తెలియని సంతోషం వెల్లువలా పొంగుకొచ్చింది. తనకే ఆశ్చర్యమేసింది. ఎందుకు ఇంత సంతోషం అనుకుంటూ టాంక్ బండ్ రోడ్ మీదగా టాక్సి వెళుతుంటే ఎప్పుడో చూసిన ప్రదేశంలా అనిపించింది ఛెల్సికి.

హోటల్‌లో చెక్ఇన్ అయి ఫ్రెషప్ అయి అడ్రెస్ పట్టుకుని బయలుదేరారు. ఇద్దరికి చాలా ఎగ్జైటింగ్ గా ఉంది.

"వాళ్ళు ఇంకా  అదే అడ్రెస్ లోనే ఉన్నారా! ఉంటే ఎలా మాట్లాడాలి? " అనుకుంటూ..

"ఇదే అడ్రెస్..! " అన్నాడు శివ ఆనందంగా.

ఛెల్సికి ఆ ఇల్లు చూసేటప్పటికి ఒక్కసారిగా వెన్నులో నుంచి జలదరించినట్లుగా అయింది. అబ్బ ఎంత ఫెమిలియర్‌గా ఉంది అనుకుంది స్వగతంలో. మెల్లిగా వెళ్ళి తలుపు కొట్టింది.

"ఎస్ కమింగ్..!" అంటూ తలుపు తెరిచింది తన వయసే ఉన్న ఒక అమ్మాయి.

"ఎవరు కావాలి? " అంది ఆ అమ్మాయి వాళ్ళిద్దరిని ఆశ్చర్యంగా చూస్తూ.

"రంగనాధం గారి కోసం వచ్చాము" అంది ఛెల్సి వణుకుతున్న వాయిస్‌ని కంట్రోల్ చేసుకుంటూ.

"ఓహ్ తాతయ్య కోసమా! రండి కూర్చోండి. వాక్‌కి వెళ్ళారు. వచ్చేస్తారు.. " అంటూ లోపలికి దారి తీసింది.

శివ, ఛెల్సి ఇద్దరూ సంతోషంగా చూసుకున్నారు..

"ఈలోగా.. నాన్నని పిలుస్తాను" అంటూ లోపలికి వెళ్ళింది. లోపల్నుంచి వచ్చిన చరణ్ వాళ్ళిద్దరిని చూసి ఆశ్చర్యపోయాడు ఇంత యంగ్ కిడ్స్‌కి తన నాన్నగారితో పని ఏమిటా అని అనుకుంటూ..

"మా అమ్మాయి స్వాతి చెప్పింది.. మీరు మా నాన్నగారిని కలవడానికి వచ్చారంట."

"అవును అంకుల్ మేము యు.ఎస్ నుంచి వచ్చాం.. ఆయనని కలవడానికి" అంటూ స్వచ్ఛమైన తెలుగులో మాట్లాడుతున్న ఆ అమ్మాయి వైపు ప్రశంసగా చూస్తూ

"ఓహ్ ఎందుకు?" కుతూహలంగా అడగబోయి ఇంతలో రంగనాధం గారు రావడంతో "డాడ్ మీకోసం యు.ఎస్ నుంచి వచ్చారుట వీళ్ళు.." అంటూ పరిచయం చేసాడు చరణ్.

"నా కోసమా? " ఆశ్చర్యంగా చూస్తూ కళ్ళజోడు సరిచేసుకుంటూ వచ్చి సోఫాలో కూర్చున్నారు.

"నేను రాధ మనవరాలిని" అంది ఛెల్సి తడబడుతున్న కంఠంతో.. ఛెల్సి వైపే చూస్తున్న రంగనాధంగారు ఉలిక్కిపడ్డారు.

"వాట్!?" అర్థం కానట్టు చూసారు.

"ఎస్ నేను మీ సిష్టర్ రాధ మనవరాలిని.. " అంటూ వివరంగా పరిచయం చేసుకుంది తన డ్రీమ్స్ గురించి ఏమీ చెప్పకుండా.. రంగనాధంగారు చాలా సంతోషించారు.

"చరణ్.. మీ రాధ అత్త అని చెపుతుంటాను చూడు తన మనవరాలు" సంతోషంగా పరిచయం చేసాడు. చరణ్ కూడా చాలా హేపీగా ఫీల్ అయ్యాడు. అప్పుడే కాఫీ తెచ్చిన తన భార్య రేఖకి, తన కూతురు స్వాతికి పరిచయం చేసాడు. లంచ్ టైం కావడంతో అందరూ అక్కడే భోజనం చేసి హాల్లోకి వచ్చారు. అప్పటికి బాగా తేరుకున్న రంగనాధం గారుని చూస్తూ

"తాతగారు రాధ గురించి అన్ని వివరంగా చెప్పరూ..!? " అంది అతని ప్రక్కనే కూర్చుంటూ..

రంగనాధంగారు చెప్పటం ప్రారంభించారు.

"మేము ముగ్గురు అన్నా చెల్లెళ్ళం. నేను పెద్దవాడిని. రెండు రాధ, మూడోది వాణి. వాణి నేను గుల్‌బర్గాలో మెడిసెన్ చేసాము. రాధని బాగా చదివించాలని నాన్న పట్టుదల కాని తనకెప్పుడు ఫ్రెండ్స్, సినిమాలు. అయినా క్లాసులో ఎప్పుడు ఫస్ట్ వస్తుండేది. మెడిసిన్ చెయ్యను అని చెప్పడంతో నాన్న బి.ఎస్. సిలో జాయిన్ చేసారు. చాలా సరదాగా ఉండేది.. తన ఫ్రెండ్స్.. అంటూ ఏదో చెప్పబోయిన రంగనాధంగారు..

"చంద్ర, రాగిణి కదు! " అంది ఛెల్సి...

ఆశ్చర్యంగా చూసారు అందరు..!!

"నీకెలా తెలుసు!? " అన్నారు రంగనాధంగారు.

"తరువాత చెపుతాను.. మీరు కానీయండి" అంది ఛెల్సి ఇంకా ఏం చెపుతారో అనుకుంటూ..

"తన కజిన్ పెళ్ళిలో మనోజ్ అంటే మీ గ్రాండ్ పా రాధని చూసి ఇష్టపడ్డాడు. చేసుకుంటే తననే చేసుకుంటాను అని పట్టుబట్టడంతో యు ఎస్. లో ఉన్న వాళ్ళ పేరెంట్స్ వచ్చి మా వాళ్ళని అడిగారు. రాధ ససేమిరా వద్దు అనింది. కాని చాలా మంచి సంబంధం అబ్బాయి లక్షణంగా ఉన్నాడు డాక్టర్. ఇంకా ఏం కావాలి నువ్వు చేసుకోకపోతే నేను నిద్రమాత్రలు మింగి చచ్చిపోతాను అంటూ అమ్మ బలవంతంగా పెళ్ళి చేసేసారు. మనోజ్ ఫ్యామిలీ అంతా యు.ఎస్ లోనే ఉంటారు ఇండియాలో వాళ్ళకి ఎవరూ లేరు. ఇండియా చూడాలని తన ఫ్రెండ్ మారేజ్ కొచ్చిన మనోజ్ రాధని పెళ్ళిచేసుకుని నెలరోజులలోపే యు.ఎస్‌కి తీసుకెళ్ళిపోయాడు.

పెళ్ళయిన తరువాత చాలా ముభావంగా అయిపోయింది రాధ. ఎవరితో మాట్లాడేది కాదు. యు.యస్‌కి వెళ్ళటం ఇష్టం లేదేమో అనుకున్నాం. అమ్మమీద కోపం అని సరిపెట్టుకుని యు.యస్‌కి పంపించాం. మనోజ్ అప్పుడప్పుడు ఫోన్ చేసేవాడు కాని రాధ మాట్లాడేది కాదు. అమ్మ నాన్నా చాలా బాధపడేవారు. ఆఖరికి రాధ ప్రెగ్నెంట్ మీరు ఎవరైనా వస్తే బాగుంటుంది అని మనోజ్ అంటుంటే, ఎవరూ రావక్కరలేదు అని ఖండితంగా చెప్పి ఫోన్ పెట్టేసింది. అమ్మా నాన్నా చాలా దిగులుపడిపోయారు. పెళ్ళైన మొదటి సంవత్సరంలోనే రాధకి డెలివరీ అయింది. అప్పటికి తనకి 22 ఏళ్ళు.." అన్నారు వస్తున్న కన్నీటిని బలవంతంగా ఆపుకుంటూ..

"ఆ దిగులుతోనే అమ్మా నాన్న పోయారు. ఆ టైములో మనోజ్ మీ అమ్మని అంటే మోనికని తీసుకొచ్చి వాళ్ళిద్దరికి చూపించాడు అప్పుడు తనకి సంవత్సరమనుకుంటా. ఆ తరువాత తను వేరే పెళ్ళి చేసుకున్నానని మోనికాకి ఇండియా సంగతులు ఏమీ చెప్పదలుచుకోలేదని ఇక తనని మరిచిపొమ్మని తమతో సంబంధం పెట్టుకోవటం ఇష్టంలేనట్టుగా చెప్పాడు. నేను చాలా బాధపడ్డాను కాని మీ అమ్మని దృష్టిలో పెట్టుకుని అలా చెప్పి ఉంటాడని సరిపెట్టుకున్నాను, ఆ తరువాత రెండు మూడు సార్లు ప్రయత్నించి తను ముభావంగా మాట్లాడటంతో నేను తగ్గించేసాను ఇదంతా జరిగి దాదాపు 50 ఏళ్ళు అవుతోంది" అంటూ దీర్ఘంగా నిట్టూర్పు విడిచాడు.

"మరి కృష్ణ ఎవరు? " అడిగింది ఛెల్సి హటాత్తుగా.

రంగనాధంగారు ఆలోచించి "నాకు గుర్తుకురావటం లేదు. నాకు రాధ ఫ్రెండ్స్ గురించి పెద్దగా తెలీదు. నేనూ నా చదువు అన్నట్లుండేవాడిని. అంతగా ఇంటికి వచ్చేవాడిని కాదు అందువల్ల నాకు తెలియదు" అన్నారు.

నిరుత్సాహంగా చూసింది. ఎలా తెలుస్తుంది అనుకుంటూ శివ వైపు చూసింది.

"మేము వెళతాం.." అంటూ లేచింది ఛెల్సి.

"అయ్యో అప్పుడేనా!? కొన్ని రోజులు మాతో ఉండు.. " అన్నారు రంగనాధంగారు ప్రాధేయపడుతున్నట్లుగా.

శివకూడా బలపరిచాడు "నువ్వు హోటల్‌లో ఉండేకంటే ఇక్కడే ఉండు.. నేను ముంబాయి నుంచి వచ్చేదాకా" అంటూ..

స్వాతికి చాలా సంతోషంగా ఉంది. తన ఈడు అమ్మాయి తనతో ఉంటుంది అనేటప్పటికి. ఛెల్సికి కూడా మనసు ప్రశాంతంగా ఉంది ఆ కలలు కూడా రావటం లేదు ఇక్కడికి వచ్చిన తరువాత కాని కృష్ణ గురించి తెలుసుకోలేకపోతున్నాను అని చాలా బాధగానే ఉంది. రెండు రోజుల్లో వాణి బెంగుళూరు నుంచి వస్తుంది అని చెప్పారు రంగనాధంగారు. అది ఒక్కటే కాస్త హోప్. వాణి గ్రాండ్ మా కేమన్నా తెలుసేమొ అని..

" ఛెల్సి.. రేపు ఉగాది మనం బట్టలు కొనుక్కుందాం పద" అంది స్వాతి ఉత్సాహంగా.. ఉలిక్కిపడింది ఛెల్సి. ఉగాది అంటే రాధా కృష్ణ ఉగాది పచ్చడి అనుకుంటూ తనకొచ్చిన కలని గుర్తుకు తెచ్చుకొచ్చింది. ఇద్దరూ కలసి మాల్ కెళ్ళారు.. అక్కడ చీరలు చూస్తుంటే గులాబి రంగు జార్జెట్ చీర కనిపించగానే చటుక్కున ఛెల్సి తీసుకుంది

"నువ్వు చీరలు కడతావా? " ఆశ్చర్యంగా చూసింది స్వాతి.

"అవును.. " అంది ఆ చీరని ఆప్యాయంగా చూస్తూ. తన కలలోకి వచ్చిన రాధ అదే కలర్ చీర కట్టుకుంది. అందుకే అంత ఇష్టంగా ఉంది కాబోలు ఆ చీరంటే అనుకుంది ఛెల్సి. లక్కీగా రెడీమేడ్ బ్లౌజ్ కూడా దొరకటంతో హేపీగా పాక్ చేయించింది.

ఉగాది రోజు అందరూ పొద్దున్నే తలంటుకుని ఇంటికి తోరణాలు కడుతూ చాలా హడావిడిగా ఉన్నారు. ఛెల్సి కూడా తలంటుకుని స్వాతిని అడిగింది చీరకట్టుకోవడానికి హెల్ప్ చేయమని.... "బాబోయ్ నాకు రాదు మా మమ్మీని పిలుస్తా" అంటూ పరిగెట్టింది వంట ఇంట్లోకి.

ఛెల్సికి చీర కట్టి పొడవాటి జుట్టుని చిక్కుతీసి జడవేసి తలనిండా మల్లెపూలు పెట్టి కళ్ళకి కాటుక, బొట్టుపెట్టి ముద్దు పెట్టుకుంటూ "యు లుక్ బ్యూటిఫుల్" అంది రేఖ.

"మామ్ వాణి గ్రాండ్ మా ఈజ్ హియర్..!" అంటూ స్వాతి అరిచింది.

"వస్తున్నా.. " అంటూ రేఖ వెళ్ళింది.

ఛెల్సి తనని అద్దంలో చూసుకుని ఉలిక్కిపడింది రాధ అద్దంలోకి వచ్చినట్లుగా అనిపించి! ఇంతలో స్వాతి పిలవడంతో గబగబా కిందకి వచ్చింది. వాణి ఛెల్సిని చూస్తూనే అచేతనంగా అయిపోయింది మాటలు రాక బిగుసుకుపోయింది ఒక్క నిమిషం.

ఆ తరువాత మెల్లిగా తేరుకుని "అక్కా.. " అంటూ దగ్గరకి వచ్చి కౌగిలించుకుని వెక్కి వెక్కి ఏడ్చింది.

ఆ తరువాత చాలా సేపు కబుర్లు చెప్పుకున్నారు. కాని తనకి కూడా కృష్ణ ఎవరో తెలియదు. రాధ ఫ్రెండ్స్ కూడా ఎక్కడ ఉన్నారో తెలీదు అనడంతో అప్పటిదాకా ఉన్న కాస్త ఆశకూడా హరించుకు పోయింది. ఛెల్సికి చాలా నిరుత్సాహంగా అనిపించింది. ఎందుకో తెలీదుకానీ వెంటనే ఇంటికి వెళ్ళిపోవాలి అనిపించింది.

"లెట్స్ గో అండ్ హావ్ లంచ్" అంటూ చరణ్ లేచాడు.

టేబుల్ మీద వంటలన్నీ ఆశక్తిగా చూస్తూ "ఆంటీ ఉగాది పచ్చడి బొబ్బట్లు ఏవి? " అంది ఛెల్సి.

అందరూ ఆశ్చర్యంగా చూసారు "నీకెలా తెలుసు..? " అడిగింది స్వాతి.

కల సంగతి చెప్పకుండా "నిన్న టి.వి ప్రోగ్రాంలో చూసాను.. " అంది ఛెల్సి.

"ఇదిగో ఉగాది పచ్చడి, బొబ్బట్లు.." అంటూ ప్రసాదం చేతికి ఇచ్చింది రేఖ. వాణి తన కుటుంబ విషయాలు చెపుతుంటే ఆశక్తిగా వింటూ లంచ్ ఫినిష్ చేసారు. స్వాతి తన ఫ్రెండ్స్‌తో మూవీకి వెళుతున్నాను రమ్మంటే లేదు నేను రిలాక్స్ అవుతాను అంటూ తన రూములోకి వెళ్ళింది ఛెల్సి, చీరలో చాలా అనీజీగా ఉంది. చేంజ్ చేద్దాం అనుకుంటూ టైం చూసుకుంది. సాయంకాలం 6 గంటలు. సడెన్‌గా గుర్తొచ్చింది.. వెంటనే పర్స్ తీసుకుని అదే చీరలో గబగబ కిందకి వచ్చి రేఖ ఆంటీతో "బయటకి వెళ్ళొస్తాను" అంటూ కిచెన్‌లో ఉన్న బొబ్బట్లు, ప్రసాదం, ఒక టిఫిన్ బాక్స్‌లో పెట్టుకుని బయటకి పరుగెట్టుకుంటూ వెళ్ళింది- మళ్ళీ అందరూ ప్రశ్నలు వేస్తారేమో అన్న భయంతో. కొంచెం దూరం నడిచిన తరువాత ఆటో కనిపిస్తే ఆపి "ఆర్ట్స్ కాలేజ్ దగ్గరికి పోనియ్" అంది.

సాయంకాలం చల్లటిగాలి వీస్తోంది వాతావరణం చాలా ఆహ్లాదంగా ఉంది ఆర్ట్స్ కాలేజ్ దగ్గర దిగేటప్పటికి మెల్లిగా చీకట్లు అలుముకోసాగాయి. తనకి ఎంతో బాగా తెలిసిన ప్రదేశంలాగా గబగబా నడుచుకుంటూ వెళ్ళింది. అక్కడంతా మారిపోయింది. అన్నీ బిల్డింగ్స్ వచ్చేసాయి ఖాళీ ప్రదేశం లేదు. తను కలలో చూసిన ప్లేస్ లాగా లేదు. చాలా నిరాశగా అనిపించింది ఆ బూరుగు చెట్టు ఆ కొండ కనిపించలేదు. ఎంతో ఉత్సాహంగా వచ్చిన ఛెల్సి నిరాశగా తిరిగి వెళ్ళబోతూ అప్పుడు గుర్తుకొచ్చింది తను ఎడమవైపు చూసానని. కాని ఆర్ట్స్ కాలేజ్ రైట్ సైడ్ ఆ చెట్టు ఉండాలి అంటూ అటు పరిగెట్టింది. అదురుతున్న గుండెల్ని అదిమి పెట్టుకుంటూ మెల్లిగా ముందరికి కదిలింది అక్కడ ఉన్న బూరుగు చెట్టువైపు. అదే చెట్టు, అదే కొండ అలాగే ఉన్నాయి. చిన్న లైట్ వెలుతురు కూడా పడటంతో ఆ ప్రదేశం బాగా కనిపిస్తోంది. ఆ రెండు తప్పిస్తే చుట్టు పక్కల అంతా బిల్డింగ్స్ వచ్చేసాయి. ఆశ్చర్యం వేసింది ఇవి రెంటిని ఎందుకు అట్టిపెట్టారా అనుకుంటూ ఆప్యాయంగా ఆ బూరుగు చెట్టుని తడిమి చూసింది. కొండమీద కూర్చుంటూ పైకి చూసింది అప్పుడే చంద్రుడు పైకి వస్తున్నాడు ఇదే సమయం అంటే రాధకి చాలా ఇష్టం. ఈ టైములోనే ఇద్దరు ఇక్కడ కలుసుకునే వాళ్ళు అనుకుంటూ తనతో తెచ్చిన బొబ్బట్లు తీసి తినబోతుంటే మనసులో ఏదో అలజడి. ప్రశాంతంగా ఉన్న వాతావరణంలో ఏదో మార్పు. గట్టిగా గాలి వీచడం మొదలు పెట్టింది. కట్టుకున్న చీర, జడలో పూలు చాలా బరువుగా అనిపించాయి. తెరిచిన బాక్స్ మూత పెట్టేస్తూ

వెళ్ళడానికి లేచింది కాని కాళ్ళు కదలలేదు. గుండెలంతా పిండేసినట్లుగా అంత చల్లటి వాతావరణంలో కూడా చెమటలు పట్టేసి ఊపిరి ఆడనట్లుగా అనిపిస్తోంది. బలవంతంగా లేచి అడుగు వేయబోయింది.

అంతలో "రాధా!" అని చెవుల్లో అమృతం పోసినట్లు, వేయివేణువులు ఒకేసారి మోగినట్లు.

అప్పటిదాకా అలజడిగా ఉన్న గుండె తేలికగా అయిపోయి, అప్పటిదాకా స్థంభించిన గాలి ఒక్కసారిగా చిరుగాలి వీచినట్లు అయింది. నెమ్మదిగా పక్కకి తిరిగి చూసింది. తెల్లటి షర్ట్ నల్లటి పాంట్ ఒక చేతిలో సిగార్, ఇంకొక చేతిలో వాకింగ్ స్టిక్ అరడుగుల ఆజానుబాహువు తన వైపే నిశ్చేష్ట అయి చూడసాగాడు. ఇంచు మించు రంగనాధం తాతగారి వయసే ఉండచ్చు చాల ఠీవిగా ధ్రుఢంగా ఉన్నాడు కాని అతని మొహంలో దిగులు, ఆశ్చర్యంగా చూసి అవును అతనే కృష్ణ..!! తన కలలోకి వచ్చిన కృష్ణ వయసులో మార్పు తప్పితే మనిషి అలాగే ఉన్నాడు. తన గుండె చప్పుడు తనకే బయటకి వినిపిస్తుంటే కదలలేక అలాగే నిల్చుండిపోయింది ఛెల్సి.

వణికి పోతున్న చేతుల్ని గట్టిగా వాక్‌స్టిక్‌తో కంట్రోల్ చేసుకుంటూ వడివడిగా దగ్గరకి వచ్చాడు. పరిగెట్టుకుంటూ వెళ్ళి పడబోతున్న కృష్ణని గట్టిగా పట్టుకుని హగ్ చేసుకుంది. ఇన్నాళ్ళూ అనుభవించిన ఆవేదన అంతా తీరిపోయి దూది పింజలా ఎగరసాగింది. ఇద్దరికీ అలాగే ఉంది. కృష్ణ ఇంకా ఆ ఉన్మాద స్థితి నుంచి తేరుకోలేదు తను చూస్తున్నది రాధనే భ్రమలో ఉన్నాడు.

"ఇన్నాళ్ళు పట్టిందా రాధ నీకు నామీద కోపం పోవటానికి.? ఎంత కోపమైనా ఇంత పెద్ద శిక్షవేయాలా? " అంటూ ఛెల్సి తలని ముద్దులతో నింపేస్తూ "ఒక్కరోజు కూడా విడిచి ఉండలేను అనేదానివి. ఏభై ఏళ్ళు ఎలా ఉండగలిగావు రాధ ?" అంటూ వస్తున్న కన్నీళ్ళను ఆపుకోటానికి కూడా ప్రయత్నం చేయకుండా మాట్లాడుతున్నాడు.

వణికి పోతున్న కృష్ణని మెల్లిగా వాళ్ళు కూర్చోనే చోటికి తీసుకొచ్చి తను తెచ్చిన వాటర్ తాగించింది. దాదాపు అర్ధగంట తరువాత ఉన్మాద స్థితినుంచి బయటపడి ఛెల్సి వైపు చూస్తూ "మై గాడ్ ఎవరు నువ్వు? నా రాధవి కావు కదూ! సారీ డిడ్ ఐ యాక్ట్ క్రేజీ ఏమి గుర్తుకు రావటం లేదు" అన్నాడు కృష్ణ తల గట్టిగా విదిలించుకుంటూ.. అప్పుడు చెప్పింది తన కల గురించి ప్రతి అక్షరం పొల్లు పోకుండా. జరిగినదంతా వింటూ తనకి తెలీకుండానే ఛెల్సి వడిలో తలపెట్టుకుని గట్టిగా ఏడ్చేశాడు.. తన వయసుని కూడా మర్చిపోయి మరీ చిన్నపిల్లవాడిలా.. ఛెల్సికి కూడా కృష్ణ ఏ మాత్రం కొత్తగా అనిపించటంలేదు.. మెల్లిగా సముదాయిస్తున్నట్లుగా తల నిమురుతూ కూర్చుండిపోయింది. కృష్ణ కొంచెం సర్దుకున్నాక మెల్లిగా అడిగింది.

"ఇప్పుడు చెప్పు కృష్ణ.. మీరిద్దరూ ఎందుకు పెళ్ళి చేసుకోలేదు.? అసలు మీరిద్దరూ ఎలా కలిసారు? " కుతూహలంగా అడిగింది "అఫ్ కోర్స్ గుర్తుంటేనే.. " అంది మళ్ళీ.

గట్టిగా నిట్టూర్పు విడుస్తూ... "మరిచిపోతే కదా అంతా నిన్న మొన్న జరిగినట్లుగా ఉంటుంది నాకు.. " అంటూ గతంలోకి వెళ్ళిపోయాడు.

***

వర్షం పడుతోంది. లోపలికెళదాం అంటూ సిగిరెట్ ఆర్పబోతున్న కృష్ణ గట్టిగా నవ్వులు వినిపించడంతో ప్రక్కకి తిరిగి చూసాడు. నవ్వుతూ పరిగెడుతున్న ఆ అమ్మాయిని చూసి షాక్ అయ్యాడు. వావ్! బ్యూటిఫుల్ పొరపాటున బ్రహ్మ దేవుడు చందమామలోనుంచి ఓ చిన్ని ముక్కతో ఆ అమ్మాయిని చేసాడేమో అన్నంత అందంగా ఉంది ఆ అమ్మాయి అనుకుంటూ కళ్ళార్పకుండా అలాగే చూస్తున్న కృష్ణకి చేతిలో ఉన్న సిగరెట్ కాలడంతో ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చాడు. అప్పుడు చూసుకున్నాడు తనని పూర్తిగా తడిసిపోయాడు. అలా ఎంతసేపు నిలుచున్నాడో తనకే తెలీదు.. అలజడిగా తనవైపు చూసి చటుక్కున పక్కకి తిప్పేసుకున్న పెద్ద కళ్ళతో మరింత వెడల్పుగా చేసి చూసిన చూపులు ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి..

"కృష్ణ కమాన్...!" అంటు ఫ్రెండ్ వచ్చాడు.

"సరే పద" అంటూ ఆ అమ్మాయి కోసం చూసాడు కనిపించలేదు.

తను మద్రాసులో బి.యి చేసి, ఎం.బి.ఎ చేద్దామని ఉస్మానియా యూనివర్శిటీకి వచ్చాడు. హాస్టల్‌లో ఉండే తనకి హైదరాబాద్ గురించి పెద్దగా తెలీదు. తనకి చుట్టాలు కూడా ఎవరూ లేరు. ఆ రోజు తన రూం మేట్ ఏదో ఫంక్షన్ వాళ్ళ పిన్ని వాళ్ళింట్లో వెళదాం అని బలవంత పెడితే వచ్చాడు. ఆ అమ్మాయి చూపులనుంచి తప్పించుకోలేకపోతున్నాడు. రోజూ వెంటాడుతూనే ఉన్నాయి. ఆ అమ్మాయిని గురించి తెలుసుకోడానికి ఏ ఆధారాలు లేవు. నిద్రలేని రాత్రులు గడిపాడు. కనిపించిన చోటుకే వెళ్ళి చూద్దాం అనుకుంటూ ఫ్రెండ్‌కి చెప్పి బైక్ మీద వచ్చాడు. వారం రోజులు ప్రతీరోజు అదే సమయానికి అక్కడకొచ్చి షాప్‌లో సిగరెట్ కొని కాలుస్తూ వెయిట్ చేసేవాడు. ఆ రోజు శుక్రవారం క్లాసెస్ లేవు ఏమీ తోచక పోతే బైక్ వేసుకుని అదే ప్లేస్ కొచ్చి వెయిట్ చేయడం మొదలుపెట్టాడు. సిగరెట్ కోసమని షాప్‌లోకి వెళుతుంటే "బ్లాక్ అండ్ వైట్ బ్యూటిఫుల్ సైట్" అని వినిపించడంతో ఉలిక్కిపడి చూసాడు. ఎవరూ కనిపించలేదు. ఉత్సాహంగా హాస్టల్‌కి వెళ్ళిపోయాడు. ఆ అమ్మాయి తనని ఏడిపిస్తుందేమోనన్న నమ్మకంతో..

మర్నాడు కూడా అదే బ్లాక్ అండ్ వైట్ డ్రెస్ వేసుకుని వెళ్ళాడు.. గంటసేపు గడిచినా ఎక్కడా కనిపించలేదు నిరాశగా బైక్ స్టార్ట్ చేయబోతుంటే అప్పుడు వినిపించింది. "బ్లాక్ అండ్ వైట్ బ్యూటిఫుల్ సైట్" అంటూ చటుక్కున తిరిగి చూసాడు. ప్చ్.. మళ్ళీ మిస్ అయాడు! ఎవ్వరూ కనిపించలేదు. కాని ఎక్కడ లేని హుషారు వచ్చింది. ఆ అమ్మాయె అని గట్టిగా అనిపించింది. చూద్దాం ఎన్నాళ్ళు కనిపించకుండా ఏడిపిస్తుందో అనుకుంటూ వెళ్ళిపోయాడు

అనుకోకుండా మద్రాస్ వెళ్ళాల్సి వచ్చింది, వారం రోజుల తరువాత మళ్ళీ అక్కడికి వచ్చాడు. కాని ఈసారి బైక్ ఎప్పుడు ఆపే చోట పెట్టకుండా దూరంగా పెట్టి కనిపించకుండా నిలుచున్నాడు. కొంచెం సేపు అయిన తరువాత ఎదురుగుండా మేడ మీదనుంచి ఆ రోజు చూసిన అమ్మాయే పరిగెట్టుకుంటూ కిందకి వచ్చి అటూ ఇటూ అసహనంగా చూస్తూ "చూడవే రాగిణి అతను ఈ రోజు కూడా రాలేదు" అంది బుంగమూతి పెట్టుకుంటూ .

కృష్ణ మనసు ఆనందంతో ఎగిరిపడింది..! ఆ అమ్మాయే..! తనకి లాగే ఆ అమ్మాయి తన కోసం చూస్తోంది అని తెలిసేటప్పటికి. ఓహో ఇన్నాళ్ళు వీళ్ళు మేడ మీద నుంచి ఏడిపించారన్నమాట.. అనుకుంటూ మెల్లిగా వాళ్ళ వైపు నడవసాగాడు. రాగిణి చూసింది. ఏదో చెప్పబోయిన రాగిణికి చెప్పొద్దు అని సైగచేసాడు.

తను ప్రక్కగా వెళ్ళి చెవిలో మెల్లిగా "బ్లాక్ అండ్ వైట్ కిస్ మి టైట్" అన్నాడు.

ఉలిక్కిపడి పక్కకి చూసి తను పక్కనే నిలబడటం చూసి హడలెత్తి పరిగెత్తబోయింది.

చటుక్కున చెయ్యిపట్టి ఆపాలని చూసాడు. "ప్లీజ్ వదలండి వెళ్ళాలి" అంది భయపడిపోతూ.

"నోప్ ఇన్నాళ్ళూ ఏడిపించావు సో ఇప్పుడు నా టైమ్.. " అన్నాడు.

కళ్ళల్లో నీళ్ళని బలవంతంగా ఆపుకుంటూ "ఇప్పుడు కాదు.. " అంటూ నిస్సహాయంగా చూసింది, ఎవరైనా చూస్తున్నారేమో అని చుట్టూ చూస్తూ.

చెయ్యి వదిలేస్తూ "అయితే సరే రేపు ఆర్ట్ కాలేజ్ దగ్గరికి 6గంటలకి రావాలి.. లేకపోతే... " అంటూ ఆపేసాడు. అప్పటికే ఆ అమ్మాయి పరిగెట్టుకుంటూ వెళ్ళిపోయింది.

వస్తుంది అన్న నమ్మకం లేకపోయినా 5:30 కల్లా ఆర్ట్స్ కాలేజ్ మెట్లమీద కూర్చుని టెన్షన్‌తో ఎదురుచూడసాగాడు. అలా వెయిట్ చేస్తూ ఎన్ని సిగిరెట్లు తాగాడో తనకే తెలీదు 7 గంటలు దాటటంతో ఇంక రాదు అనుకుంటూ నిరాశగా లేస్తుంటే అప్పుడు

కనిపించింది దూరంగా లైట్ల వెలుతురులో లైట్ బ్లూ కలర్ చీరలో ఏంజల్‌లాగా మెరిసిపోతూ మెల్లిగా నడుచుకుంటూ వచ్చింది. బిగుసుకుపోయి భయంతో ఉన్న ఆ మొహాన్ని చూసి ఫకాలున నవ్వాడు.

"ఏయ్! ఎందుకు నవ్వుతున్నావు? "కోపంగా అడిగింది.

"నీ మొహాన్ని చూస్తుంటే నవ్వు ఆపుకోలేకపోతున్నాను.. "

చటుక్కున మొహాన్ని తుడుచుకుంటూ "ఎలా ఉందేంటి నా మొహం?" అంది బింకంగా..

"నిజం చెప్పనా? కోపం రాకూడదు.. " అన్నాడు సరదాగా..

"ఊహూ చెప్పు.. " అంది అంతకంటే బింకంగా..

అది చూసి ఉడికించటానికి "అచ్చు మిస్సింగ్ - లింక్ లా" ఉన్నావు అన్నాడు కొంటెగా నవ్వుతూ..

ఉలిక్కిపడింది. ఇంకా ఏదో చెపుతాడని ఆశగా ఎదురు చూస్తున్న రాధ..

"అంటే నేను కోతిలా ఉన్నానా! ఇది చెప్పటానికా ఇంతదూరం రమ్మన్నారు.. " అంటూ వస్తున్న కన్నీళ్ళని బలవంతంగా ఆపుకుంటూ వెనుదిరి వెళ్ళబోయింది.... "ఇందు అంటూనే ఉంది వెళ్ళొద్దు అంటూ.. అయినా వినకుండా వచ్చినందుకు పెద్ద శాస్తే జరిగింది" అంది. గొణుక్కుంటూ ముందుకు సాగింది.

"ఏయ్ జోక్ చేసాను. నువ్వు మరీ భయపడిపోతుంటే.. " అంటూ గాభరాగా దగ్గరికొచ్చాడు. ఆ తరువాత తనని చూసిన దగ్గర్నించి పడిన వేదన అంతా చెప్పుకొచ్చాడు.

ఆ తరువాత ప్రతిరోజూ సాయంకాలం ఆర్ట్స్ కాలేజ్ వెనకాల బూరుగు చెట్టుకింద కలుసుకునేవాళ్ళు.

అతి ఛాందస్తుల ఇంట్లో, నిప్పులు కడిగి ప్రాయశ్చిత్తం చేసుకునే సాంప్రదాయక బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన రాధ.. సాంప్రదాయం అంటే క్రమశిక్షణ, బిహేవియర్ అన్న నమ్మకం ఉన్న కమ్మవారి కుటుంబం నుంచి వచ్చిన తనకి ఇవేమీ అడ్డురాలేదు తమ ప్రేమకి. కాని రాధ ఇంట్లో చెప్పటానికి సంశయించింది. తన ఫైనల్ ఎగ్జామ్స్ అయిపోయిన తరువాత చెపుతానంది. తనకి కూడా ఎం.బి.ఎ అయిపోతుంది జాబ్ చూసుకుంటే ధైర్యంగా చెప్పొచ్చు ఇంట్లో అనుకున్నారు ఇద్దరూ.

ఆ రోజు రాధ రాగానే గట్టిగా చేతులు పట్టుకుని ఊపేస్తూ "నాకు బెంగుళూరులో జాబ్ వచ్చింది.. 3,000 జీతం" అన్నాడు సంతోషంగా. రాధ అంతకంటే సంతోషపడింది.

"నేను రేపు బెంగుళూర్ వెళ్ళి పేపర్ సైన్ చేసి అటునుంచి మద్రాసు వెళ్ళి మా పేరెంట్స్‌కి మన సంగతి చెప్పి వాళ్ళని తీసుకొస్తాను" అన్నాడు సంతోషంగా..

"గుడ్ నేను కూడా ఇంట్లో చెప్పేస్తాను.. నెక్స్ట్ వీక్ నా ఎగ్జామ్స్ కాగానే" అది రాధ ఆనందంగా. "కాని పదిరోజులు నిన్ను చూడకుండా ఉండలేను కృష్ణ. " అంది అయిష్టంగా..

"తప్పదు స్వీట్ హార్ట్. ఈ పదిరోజుల తరువాత లైఫ్ అంతా మనం కలిసే ఉంటాం కదా" లాలనగా అన్నాడు.

"అయితే ఒక్క షరతు. ఈ ఆదివారం మొత్తం నాతోటే గడపాలి.. " అంది గోముగా భుజం మీద ఒరిగిపోతూ.

గట్టిగా విజిల్ వేసాడు. "అంతకన్నానా!" అంటూ హుషారుగా గండిపేటకి వెళదాం అని డిసైడ్ చేసారు.

పదిగంటలకల్లా బైక్ మీద గండిపేటకి చేరుకున్నారు. రాధ ఆవకాయ, పెరుగన్నం తీసుకొచ్చింది. దాన్లోకి మురుకులు కూడా తెచ్చింది. ఆవకాయ అంటే రాధకి చాలా ఇష్టం. తను ఆవకాయ ఎప్పుడూ తినలేదు అని చెప్పినప్పుడు తెల్లబోయి చూసింది ఏదో ఆదిమానవుడిని చూసినట్లు..

"మా ఇంట్లో ముక్కలు, తొక్కలు తప్పితే ఇలాంటివి పెద్దగా మేము తినము" అన్నాడు నవ్వుతూ. అందుకే ఆ రోజు ఆవకాయ అన్నం తెచ్చింది. అలాగే రాధకి తెలుగు నవలలు అంటే ప్రాణం అందులో "సెక్రటరీ" అంటే మరీ ఇష్టం.. తనని చదవమంటే తనకి చదవడం రాదని చెప్పాడు. అలా అయితే నేనే చదివి వినిపిస్తాను అంటూ ఆ రోజు ఆ నవల కూడా తెచ్చింది. ఆవకాయ ముద్దలు కలిపి నోట్లో పెడుతుంటే కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

ఆమె "కారంగా ఉందా! మంచినీళ్ళు తాగు.. " అంది కంగారుగా..

"నో నో అది కాదు మా ఇంట్లో అందరూ బిజీ. అమ్మ కల్చరల్ క్లబ్ ప్రెసిడెంట్, నాన్న రైల్వేస్‌లో డైరెక్టర్. ఇంటినిండా పనిమనుషులు వాళ్ళే మమ్మల్ని పెంచారు. అమ్మకి ఎప్పుడూ టైం ఉండేది కాదు. అందుకే నువ్వు ప్రేమతో పెడుతుంటే నాకు.. " అంటూ ఆగిపోయాడు.

నుదిట మీద ముద్దు పెడుతూ "రోజూ నీకు ముద్దలే కలిపి పెడతాను" అంది. కొంచెం సేపు "సెక్రటరీ" చదివి వినిపిస్తుంటే తను ఏడిపించటం మొదలు పెట్టాడు ఆ హీరో, హీరోయిన్‌లని.

***

రాధకి కోపం వచ్చి లేచి వెళ్ళిపోయింది. కోపం పోవటానికి తనకి ఇష్టమైన స్ట్రాబెర్రీ ఐస్ క్రీం తేగానే కోపమంతా పోయి చటుక్కున లాక్కుని తినేసింది. చినపిల్లలాగా అయిపోయి కళ్ళకి గంతలు కట్టి కొంచెంసేపు ఆడుకున్నాం. ఆ తరువాత భవిష్యత్తులో ఏమేం చేయాలి, ఎలా చేయాలి అంటూ చిలిపిగా వాదించుకున్నాం. సాయంకాలం జారిపోతుంటే బాధగా ఉన్నా ఇంక పదిరోజులలో కలుసుకుంటాం అన్న ఆనందంతో విడిపోయాం.

గతంలోంచి బయటపడుతూ భారంగా నిట్టూర్పు వదిలాడు కృష్ణ.

తనే గండిపేటలో కృష్ణతో పరిగెడుతున్నట్టుగా అనిపిస్తూ పూర్తిగా దాన్లోకి వెళ్ళిపోయిన ఛెల్సి కృష్ణ చెప్పటం ఆపడంతో ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చింది.

"మరి మరి ఏమయింది కృష్ణ? ఎందుకు చేసుకోలేదు" సస్పెన్స్‌ని తట్టుకోలేనట్టుగా గట్టిగా కృష్ణని కుదిపేసింది. దీర్ఘంగా నిట్టూర్పు విడుస్తూ మెల్లిగా చెప్పటం ప్రారంభించాడు.

***

బెంగుళూరులో పని ఫినిష్ చేసుకుని మద్రాస్ వెళ్ళాడు ఉత్సాహంగా. అప్పుడు నాన్న చెప్పారు అమ్మ కలకత్తా తన మేనకోడలి పెళ్ళికి వెళ్ళింది. 2 గంటల ఫ్లైట్ కొస్తుంది అని టైం చూసుకున్నాడు. 1:30 కావొస్తోంది 'డాడ్ అమ్మని నేను పిక్ చేసుకుని వస్తాను మీరు రెస్ట్ తీసుకోండి' అంటూ కార్ తాళం చేతులు తీసుకుని బయలుదేరాడు. తనలోతనే నవ్వుకుంటూ అమ్మకి ఎలా చెప్పాలా అనుకుంటూ రాధ గురించి ఆలోచించుకుంటూ డ్రైవ్ చేస్తున్న కృష్ణ ఎదురుగా వస్తున్న పెద్ద లారీని చూసుకోలేదు. ప్రక్కకి తిప్పుకునే టైం కూడా లేక లారి వచ్చి గట్టిగా కొట్టేసింది కారుని. తరువాత ఆరునెలలకి కళ్ళు విప్పాడు. రాధా! అని అరిచాడు. అక్కడే పడుకుని ఉన్న అమ్మ పరిగెట్టుకుంటూ వచ్చింది. 'నాన్నా కృష్ణ.. నువ్వు లేచావా! ఏవండి మన బాబు లేచాడండి' అంటూ అమ్మ ఏడవటం మొదలు పెట్టింది. అతడికేమీ అర్ధంకావటంలేదు. ఆ తరువాత మెల్లిగా నాన్న చెప్పారు. ఏక్సిడెంట్‌లో తను పోయాడనే అనుకున్నారని ఆరు నెలలుగా కోమాలోనే ఉన్నాను అని. కాళ్ళూ చేతులు కదలడం మానేసాయని. మళ్ళీ తనని ఇలా చూస్తామని అనుకోలేదని. అంతా వింటున్న కృష్ణ చటుక్కున లేవబోయాడు కాని కాళ్ళు బాగా నొప్పిపెట్టడంతో లేవలేకపోయాడు. కాని 'నేను రాధని చూడాలి ఎలాగైనా

తనకీవిషయం చెప్పాలి' అంటూ గొడవపెట్టాడు. అంతా విన్న తరువాత నాన్న తనే రేపు హైదరాబాద్ కెళ్ళి వాళ్ళతో మాట్లాడి వస్తానని చెప్పారు. అప్పటికప్పుడు రాధ దగ్గరికి వెళ్ళాలనిపించింది. కాని శరీరంలో ఏ అవయవమూ తనతో సహకరించలేదు.

ఇంతలో తన రూమ్‌మేట్ హరి వచ్చాడు. అరెయ్ కృష్ణా నిన్ను ఇలా చూస్తాననుకోలేదురా అంటూ కళ్ళల్లో నీళ్ళు పెట్టుకున్నాడు. మాటల్లో మెల్లిగా చెప్పాడు. రాధకి పెళ్ళయిపోయి యు.ఎస్ కి వెళ్ళిపోయిందని నెత్తిమీద పిడుగుపడ్డట్టుగా అయింది.

'నో అలా జరగటానికి వీలుకాదు' అంటూ అరిచాడు గట్టిగా.

***

డాక్టర్ వచ్చి మత్తు ఇంజెక్షన్ ఇచ్చి పడుకొమ్మని చెప్పి వెళ్ళిపోయాడు. ఆ తరువాత దాదాపు రెండేళ్ళు పట్టింది లేచి తిరగడానికి. ఈ లోపల మంచం మీదే ఏం చేయాలో తోచక పోతుంటే నాన్న స్టాక్ మార్కెట్ గురించి చెప్పి, పుస్తకాలు తెచ్చి ఇచ్చారు. కసిగా ఆ పుస్తకాలని అదే పనిగా చదివి స్టాక్ మార్కెట్ మీద మంచి పట్టు సంపాదించాను. నాన్నకూడా ఇన్వెస్ట్ చేయమంటూ ఎంకరేజ్ చేసారు. చిన్న చిన్నగా చేస్తూ బాగా మెళుకువలు నేర్చుకున్నాను. ఇంతలో నాన్నకి హార్ట్ ఎటాక్ వచ్చి పోయారు. దానితో అమ్మ బెంగపడి మంచం పట్టింది. నాకు తెలీకుండానే పరిస్థితులని నా చేతిలోకి తీసుకున్నాను. స్టాక్ మార్కెట్ ప్రపంచంలో పడి అన్నీ మర్చిపోవాలని చూసాను. పెట్టిన ప్రతి పెట్టుబడి లాభంగా మారి అనతి కాలంలోనే డబ్బు పేరు ప్రతిష్ట సంపాదించాను కాని మనసు మాత్రం కరుడుకట్టిపోయింది. అమ్మ రోజూ బాధ పడుతుండేది. తను ఆ రోజు పెళ్ళికి వెళ్ళకపోతే ఈ ఏక్సిడెంట్ జరిగి ఉండేది కాదని తనమూలంగానే నా లైఫ్ పాడైంది అని నేను సర్ది చెప్పేవాణ్ణి. ఎన్నోసార్లు అనుకున్నాను. హైదరాబాద్ వెళ్ళి రాధ అడ్రెస్ తీసుకుని తనకి జరిగింది వివరంగా రాద్దామని తనని మోసగాడు అనుకోవద్దు అని. కాని ధైర్యం చాలేదికాదు. చివరికి ధైర్యం చేసి వెళ్ళాను వాళ్ళింటికి. వాకిలి తెరిచే ఉంది. లోపలికి అడుగుపెట్టాను ఎవరైనా ఉన్నారేమో అనుకుంటూ కరెంట్ షాక్ తగిలినట్టు అక్కడే నిలుచుండిపోయాను. ఎదురుగా రాధ నవ్వుతూ ఉన్న ఫోటోకి పక్క వాళ్ళ అమ్మా, నాన్న ఫోటోలకి దండలు వేస్తూ కనిపించాడు వాళ్ళ అన్నయ్య. ఇంకా నీరసం తగ్గలేదేమో అది చూస్తూ అక్కడే కళ్ళు తిరిగిపడిపోయాను. కళ్ళు తెరిచి మెల్లిగా లేచి కూర్చున్నాను.

రంగనాథ్ తన వైపు చూసి 'మీరు కళ్ళు తిరిగిపడిపోయారు. చాలా వీక్‌గా ఉన్నారు ఇప్పుడే ఇంజెక్షన్ ఇచ్చాను. కాస్త మంచి నీళ్ళు తాగండి' అంటూ ఇచ్చారు.

నేను లేచి వెళ్ళబోయాను.

"నో.. నో మీరు కొంచెం సేపు కూర్చోండి. ఇంతకీ మీకు ఎవరుకావాలి? " అడిగాడు రంగనాథ్.

నాకు చెప్పబుద్ధి కాలేదు.

"సారీ తప్పు అడ్రస్‌కి వచ్చాను" అంటూ పిలుస్తున్నా వచ్చేసాను.

అమ్మ గొడవ భరించలేక పెళ్ళి చేసుకున్నాను. ఇద్దరు పిల్లలు ఆది, స్నేహ వాళ్ళ ముద్దు మురిపాలతో రాధని మర్చిపోవాలని ప్రయత్నిస్తున్న సమయంలో నా వైఫ్ మాధవి నా కంపెనీలో పనిచేసే అకౌంటెంట్‌తో వెళ్ళిపోయింది. అది తట్టుకోడానికి చాలాకాలం పట్టింది. ఆది, స్నేహ పెంపకం స్టాక్ మార్కెట్‌తో కాలం చాలా త్వరగా వెళ్ళిపోయింది. వాళ్ళిద్దరూ యు.ఎస్‌లో సెటిల్ అయారు. నేను హైదరాబాద్‌కి మకాం మార్చేసాను. ఎంత వద్దనుకున్నా అనుక్షణం రాధ నన్ను వెంటాడుతూనే ఉంది. ప్రతిరోజూ ఇక్కడికి వాక్‌కి వస్తాను. నా డబ్బు, ఇన్‌ఫ్లూయన్స్ ఉపయోగించి ఈ ప్లేస్‌ని అలాగే అట్టిపెట్టుకున్నాను. యూనివర్శిటీ వాళ్ళు ముందు ఒప్పుకోలేదు. కాని బతిమాలగా చివరికి ఒప్పుకున్నారు. ఇక్కడ కూర్చున్న గంటే నేను జీవించినట్లుగా ఉంటుంది. బయటికొస్తే నేను మనిషిని కాదు. ఎప్పుడూ రాధతో అనేవాడిని నీ వడిలో తలపెట్టుకుని నేను కన్నుమూయాలి అని. " దీర్ఘంగా ఊపిరి తీసుకున్నాడు.

ఛెల్సి తనకే తెలియకుండా ఏడుస్తోంది కళ్ళు తుడుచుకుంటూ.... తన గురించి తన అమ్మ గురించి మెల్లిగా చెప్పసాగింది. కృష్ణ ఛెల్సి వడిలో పడుకుని కళ్ళు మూసుకుని మౌనంగా వినసాగాడు. ఛెల్సి ఎందుకో మధ్యలో ఆపి "కృష్ణా వింటున్నావా నిద్రపోతున్నావా..? " అంటూ కృష్ణని కుదిపింది.

ప్రశాంతంగా సేద తీర్చుకుని తృప్తిగా వెళ్ళినట్లు ఈ లోకాన్ని విడిచి పెట్టి వెళ్ళిపోయాడు..

ఛెల్సి నిశ్చేష్టురాలయి అలాగే కూర్చుండిపోయింది.!!

●●●

Click here to share your comments on this story